

# ఈ ప్రశ్నకు బదులేది?

—చంద్రం

సరస్వతి గంగా భాగీరథీ సమానురాలై చాలా కాలమైంది లక్షలు, కోట్లు కనప్పెట్టెల్లోనూ, బ్యాంకుల్లోనూ మూలుగుతూ వుండక పోయినా, కూటికీ, గుడ్డకూ లోటు లేకుండా సాఫీగా జీవితం గడిచిపోవటానికి అవసరమైన ఏర్పాట్లు చేసిపోయాడు ఆమె భర్త శివరామయ్య.

సరస్వతి కూతురు అనూరాధ.

అనూరాధ పెళ్ళి ఒక ముఖ్యసమస్యగా తయారైంది సరస్వతికి సరస్వతికే కాదు - ఆడపిల్లల్ని కన్న ప్రతి తల్లిదండ్రులకీ ఆ సమస్య వుంటూనే వుంది ఈ సమాజంలో. పిల్లల్ని కనటంతో పాటు పెంచి పెద్దచెయ్యటం, విద్యాబుద్ధులు నేర్పించటం, పెళ్ళి చెయ్యటం కూడా తల్లిదండ్రుల బాధ్యతే.

క్రమశిక్షణతో కూడిన సరస్వతి పెంప

కంలో, పిల్లలంటే యిలా వుండాలి అన్నంత లక్షణంగా పెరిగింది అనూరాధ. స్వతహాగా అందంగా వుండే అనూరాధ సరస్వతి పోషణలో ఎల్లవేళలా మంచు కడిగిన మల్లెపువ్వులా వుంటుంది.

పద్దెనిమిదేళ్ళు నిండిన అనూరాధ బియస్సీ రెండవ సంవత్సరంలో వుంది.

అనూరాధ బియస్సీలో చేరక ముందు మంచీ సంబంధాల కోసం ప్రయత్నించ సాగింది సరస్వతి. ఇలాంటి సందర్భాల్లో మగ దిక్కు ఎంతో అవసరం. భర్తలేని లోటు కొట్టవచ్చినట్టు కనిపించింది సరస్వతికి. తన తరపున, భర్త తరపున ఎంతో మంది బంధువు లున్నారు. కాని, ముందుకొచ్చి ఆదుకొనేవాళ్ళు ఒక్కరూ లేరు. అక్కరకు రాని చుట్టా లెంద రుంటే నేమి?

తన భర్త శివరామయ్య బ్రతికివున్న రోజుల్లో ఆయనకి సన్నిహిత మిత్రుడిగా వ్యవహరించిన పరంధామయ్యాని ఆపద్ధర్మంగా సహాయం అర్థించింది సరస్వతి.

సరస్వతి అడిగింది ఆర్థిక సహాయం కాదు గనుక, పెద్ద మనిషిగా, మధ్య వర్తిగా, మాట మాత్రం సహాయం చెయ్యా టానికి నిరభ్యంతరంగా అంగీకరించాడు పరంధామయ్య అదే పదివేలుగా భావిం చింది సరస్వతి.

పరంధామయ్య ప్రయత్నాల ఫలితంగా ఒక శుభ ముహూర్తాన వెంకట్రామయ్య దంపతులు కొడుకును తీసుకొని పెళ్ళి చూపుల కొచ్చారు.

పరంధామయ్య మధ్యవర్తిత్వం తీసుకొని వీరి వివరాలు వారికీ, వారి వివరాలు వీరికీ తెలియజెప్పాడు.

చెప్పుకోదగ్గ ఆస్తిపాస్తులు లేక పోయినా, సాంప్రదాయిమైన కుటుంబం. అబ్బాయి లక్షణంగా ఉద్యోగం చేసు కుంటున్నాడు. కూటికీ, గుడ్డకూ లోటుండదు. అత్తమామలు మంచి వారు.

అమ్మాయి రూపసి. చదువుకుంది. తండ్రి లేకపోయినా తల్లి వుంది. అచ్చ ట్లకు ముచ్చట్లకు ఎలాంటి లోపం రాదు. ఒక్కతే పిల్ల గనుక తల్లి తదనంతరం ఆమెకు సంబంధించిం దంతా పిల్లకే చెందుతుంది.

పిల్లను చూసి, వివరాలన్నీ విన్న తర్వాత - ఫర్వాలేదు అనుకున్నాడు వెంకట్రామయ్య.

పిల్ల అందంగా వుంది. కట్టు బొట్టు తీరు బావుంది. చిదిమి దీపం పెట్టుకో కోవచ్చు - అని అభిప్రాయపడింది ఆయన భార్య.

ఈ సంబంధం ఖాయపర్చేస్తే బావుణ్ణు నాన్న — అని ఆశపడ్డాడు పితృవాక్య పరిపాలనా పరాయణుడైన పెళ్ళికొడుకు.

టిఫిన్లు, కాఫీలు సేవించి తృప్తిగా లేచారు.

పెళ్ళిచూపుల తంతు పూర్తైంది. అన్ని

మధ్య తరగతి కుటుంబాల్లో జరిగే పెళ్ళి చూపుల్లాగే అ పెళ్ళిచూపులూ జరిగినయ్.

పరీక్ష జరిగిన హాల్లో అప్పటికప్పుడే అక్కడే ఫలితాలు ప్రకటించటం సాంప్రదాయం కాదు కనుక, తర్వాత ఉత్తరం రాస్తామని చెప్పి వెంకట్రామయ్య సతీసుత సమేతంగా రైల్వే స్టేషన్‌కు తరలి వెళ్లాడు.

వాళ్ళని బండెక్కించి వచ్చిన పరంధామయ్య — "చెల్లెమ్మా! ఇక పెళ్ళి విషయంలో యింక నువ్వేమీ భయ పడాల్సిన పనిలేదు. బెంగ పెట్టుకో వల్సింది అంతకన్న లేదు. ఈ సంబంధం ఖాయమైపోయినట్టే. అ మాట యిప్పుడే చెప్పటం పద్ధతికాదు గనుక తర్వాత ఉత్తరం రాస్తామన్నారు. అంతే. ఇంక నీ ఏర్పాట్లలో నువ్వుండు" అంటూ భరోసా యిచ్చాడు.

"అంతా మీ దయ అన్నయ్యగారూ! మీకు అజన్మాంతం రుణపడి వుంటాను." అంది కృతజ్ఞతా పూర్వకంగా సరస్వతి.

"ఇందులో నేను చేసిందేముందమ్మా? కేవలం మాటసాయం, అంతే!" అన్నాడు పరంధామయ్య.

వారం రోజులు యిట్టే గడిచిపోయి నయ్

ఈ వారం రోజులూ వెంకట్రామయ్యా గారి దగ్గిర్నుంచి రాబోయే ఉత్తరం కోసం అనుక్షణం వెయ్యి కళ్ళతో ఎదురు చూస్తూనే వుంది సరస్వతి.

పెళ్ళిచూపుల తంతు సవ్యంగానే జరిగినా, పరంధామయ్య అంతగా భరోసా యిచ్చినా, సరస్వతికి మాత్రం అంత రాంతరాల్లో కొంచెం భయంగానే వుంది. పెళ్ళికి వాళ్ళు అంగీకరిస్తే బావుణ్ను అన్న ఆశ, తప్పకుండా అంగీకరిస్తారు అన్న నమ్మకం, ఒకవేళ కారణాంతరాల వల్ల కాదంటారేమో అన్న భయం.... ఇన్ని రకాల ఆలోచనలు ఆమెని వుక్కిరి బిక్కిరి చేసివేసినయ్.

ఎనిమిదవ రోజున వెంకట్రామయ్య గారి నుండి ఉత్తరం వచ్చింది. ఆ సమయంలో అనూరాధ యింటివద్ద లేదు. కాలేజీకి వెళ్ళింది. సరస్వతి కవరు చించింది.

"గ. ఖా. స.రాలైన సరస్వతమ్మ గారికి —

పరంధామయ్యగారి మాటలు విశ్వ సించి పెళ్ళి చూపులకు బయల్దేరి రావటం జరిగింది. మీరు చేసిన మర్యాదలకు లోటు లేదు. మీ అమ్మాయి కూడా మా యింటిల్లి పాదికీ నచ్చింది. కట్న కానుకల విషయంలో మాకంతగా పట్టింపులేదు. అన్ని విధాల అనుకూలమైన సంబంధం దొరికితే, అసలు కట్నం లేకపోయినా వెనుకాడ కూడదని మేము మొదటే నిర్ణయించుకున్నాం.

పరంధామయ్యగారికి నేను మొదటే మనవి చేశాను – సంప్రదాయాని కిచ్చే విలువ మరి దేనికీ మేం యివ్వమని.

తరతరాల నుంచీ సంప్రదాయానికి పెట్టింది పేరుగా మా కుటుంబం చలామణి అవుతుంది. మా యింటి పేరే సంప్రదాయం వారు. ఆ పేరు నిలబెట్టు కొనేందుగ్గాను మీ సంబంధం చేసుకోవటానికి మేం అంగీకరించలేకపోతున్నాం అని తెలియజేయటానికి చింతిస్తున్నాను.

పరంధామయ్య మీ మనిషే కనుక ఆయన చెప్పిందంతా నిజమేనని మేం నమ్మలేం కదా? అంచేతే మీ కుటుంబం మంచిచెడ్డల గురించి మరి కొందర్ని వాకబు చేశాం.

అనూరాధ మీకు శివరామయ్యగారి వల్ల కలిగిన సంతానం కాదట!

ఆ సంగతి తెలిసిం తర్వాత కూడా మీ సంబంధం చేసుకొనే సాహసం మాకు లేదు. క్షమించండి.

ఇట్లు

సంప్రదాయం వెంకట్రామయ్య."

ఉత్తరం చదవటం పూర్తయ్యేసరికి సరస్వతికి ఒళ్ళంతా చెమట పట్టేసింది. వారం రోజులు లంఖణం చేసినంత నీరసం కలిగి, శోష వచ్చినట్లైపోయింది. కొద్దిక్షణాలు అచేతనంగా వుండిపోయింది. మనస్సు కూడా పనిచెయ్యలేదు.

వెంకట్రామయ్యగారు ఈ సంబంధానికి అంగీకరించలేదు, అన్న వార్తే ఆమెపై యింతటి ప్రభావాన్ని చూపించింది. ఆ కంగారులోనే, ఈ సంబంధం అంగీకరించక పోవటానికి వెంకట్రామయ్యగారు చూపించిన కారణం గురించి అంతగా పట్టించుకోలేదామె. కానీ, తరవాత కాస్త స్తిమితం చిక్కాక, రెండవసారి ఉత్తరం చదువుతుంటే, ఆ వాక్యం పలుక్కున గుండెల్లో గుచ్చుకున్నట్లయింది.

అనూరాధ తనకు శివరామయ్యగారి వల్ల కలిగిన సంతానం కాదట!

కాకపోతే మాత్రం ఏం మునిగిపోయింది? సంప్రదాయానికేం ముప్పొచ్చిం దిప్పుడు? అనూరాధ చెడిపోయిందా! అనూరాధని కన్న తను చెడిపోయిందా? సంప్రదాయమంటే ఏమిటసలు? వెంకట్రామయ్యగారు ప్రాణాధికంగా గౌరవించి సంరక్షించుకోవాలనుకుంటున్న సంప్రదాయానికి కొలబద్ద లేమిటి? తూకం రాళ్ళేవి?

కొద్దిసేపు తీవ్రంగా ఆలోచించింది. మరికొద్దిసేపు తర్జన భర్జనపడింది. బాధ స్థానే కోపం చోటుచేసుకుంది ఆమె మనస్సులో. అసహనం కట్టలు తెంచుకుంది.

వెంటనే కాగితం కలం తీసుకుంది సరస్వతి.

"మహారాజశ్రీ సంప్రదాయం వెంకట్రామయ్యగారికి —

* * *

వెన్నెల విరకాస్తోంది. కొబ్బరి ఆకుల సందుల్లోంచి పడిన వెన్నెల

కిటికీ ముందు చీకటి వెలుగుల చదరంగపు గళ్ళను సృష్టిస్తోంది. తెరచి వుంచిన కిటికీలోంచి వుండి వుండి చల్లనిగాలి విసుర్లు లోపలికి వచ్చి ప్రాణానికి హాయిని కలిగిస్తున్నాయి.

"వెన్నెల ఎంత మనోహరంగా వుందో చూశారా? బయటికి వెళ్తే రాత్రి అన్న సంగతే మరిపించేంత వెలుగ్గా వుంది." అంది కిటికీలోంచి తదేకంగా బయటికి చూస్తున్న సరస్వతి భర్త నారాయణరావుతో.

సరస్వతి నిండు గర్భిణి. లెక్కల ప్రకారం నెలలు నిండినయ్. ఏ క్షణంలో నైనా నొప్పులు ప్రారంభమై కాన్పు కావచ్చు. ఆ విషయం గురించే తీవ్రంగా ఆలోచిస్తున్నాడు నారాయణరావు. భార్య కాన్పును గురించిన ఆలోచన వచ్చినప్పు డల్లా అతని మనసు వ్యాకులపాటుకు గురికాసాగింది. అయినా, అంతటి క్లిష్ట పరిస్థితిలోనైనా ఏమాత్రం చలించని భార్య మనస్థైర్యం అతనికి కొంత వూరట కలిగిస్తూంటుంది.

తనకు కొండంతలుగా కనిపించే సమస్యలు ఆమెకు సామాన్యంగా కనిపి స్తాయి. సమస్యకు పరిష్కారం కనిపించక తను వుక్కిరిబిక్కిరి అవు తున్నా ఆమె తొణకదు, బెణకదు.

భార్యకు సమాధానంగా "ఊఁ" అన్నాడు నారాయణరావు.

"ఇలాంటి వెన్నెల చూసిన ప్రతిసారీ మన తొలి కలయిక గుర్తొస్తూంటుంది. అప్పట్లో మీరు వెన్నెల చూసినప్పుడల్లా కవిత్వం మాట్లాడేవారు," ఆమె యింకా ఆ ధోరణిలోనే వుంది. భర్త వ్యాకుల పాటును గమనించలేదు

"అవును సరస్వతీ! జీవితం వెన్నెల వెలుగులా వున్నప్పుడు ఎలాంటివారి కైనా కవిత్వం పుట్టుకొస్తుంది. అందాన్ని ఆస్వాదించగల నిర్మల హృదయం వున్నవారికి ఈ ప్రపంచమే ఒక వెన్నెల వెల్లువలా కనిపిస్తుంది." ఆ సమయంలో భార్యకు నిరుత్సాహాన్ని కలిగించటం అతని కిష్టంలేదు.

"వెన్నెల ఎంత అందంగా వుంటేనేం? కాస్సేపు అలా బయటికి వెళ్ళి తిరిగిరావ టానికి వీల్లేదు కదా. మన భార్యాభర్తల కూడా ప్రకృతిలో పరవశించిపోవ టానికి స్వాతంత్ర్యం లేదు. వింత జంతువుల్ని చూసినట్టు చూస్తారు. ప్రకృతి కల్మషమైపోతున్నట్టు బాధపడి పోతారు. సంకుచిత మనస్తత్వాలతో, అర్థంపర్థంలేని కట్టుబాట్ల అడ్డుగోడల్ని సృష్టించి, గాలీ వెలుతురులేని చీకటి గదుల్లోనే కుళ్ళిపొమ్మని శాసిస్తారు. ప్రకృతి ప్రసాదించే ఆనందాన్నీ, ఆరో గ్యాన్నీ వీళ్ళ నీతినియమాలు అంగీక రించవు. అంతా బానిస ప్రవృత్తి. వీళ్ళు సుఖపడరు. సుఖపడేవారిని చూసి సహించలేరు. ఛీ. ఏం సమాజం!" విసుక్కుంది సరస్వతి.

జీవితంపట్ల సరస్వతికి ఓ నిశ్చితమైన అభిప్రాయం వుంది. కులాలు, మతాలు, కట్టుబాట్లు, నియమాలు.... ఏవైనా కాని మనిషి ఆనందానికీ స్వేచ్ఛకీ అడ్డువచ్చినప్పుడు అవన్నీ అనవసరం. మనిషన్నవాడు అలాంటి వాటన్నింటినీ ధైర్యంగా ప్రతిఘటించి, జీవితాన్ని నిష్కంటకం చేసుకోవాలి. పూలబాటగా మలుచుకోవాలి — అన్నది ఆమె అభిప్రాయం. ఆ అభిప్రాయం మీది విశ్వాసంతోనే అయినవాళ్ళందరూ కాదంటున్నా తను కోరుకున్న నారాయణ రావుతో గుళ్ళోపెళ్ళికి వెనుకాడలేదు.

నారాయణరావుది తమ కులం కాదు. అందుచేత ఆమె తల్లిదండ్రులు, బంధువర్గం అంతా ఆ పెళ్ళి జరక్కుండా చెయ్యాలని ఎంతో ప్రయత్నించారు. అయినా సరస్వతి తన మనస్సును మార్చుకోలేదు. తనే చొరవ చూపించి, వెనకముందాడుతున్న నారాయణరావుకు ధైర్యంచెప్పి అతనికి భార్య కాగలిగింది.

నారాయణరావుకు వెనకముందు ఎవరూ లేరు. అందుచేత కులాంతరమే అయినా ఆ పెళ్ళివల్ల అతని కంతగా యిబ్బంది కలగలేదు. కాని, సరస్వతి పెద్దకుటుంబంలోని వ్యక్తి. పదిమంది సొంతం గలది. తల్లిదండ్రులు పరమ ఛాందసులు. పెళ్ళైన మరుక్షణంనుంచీ ఆమె తల్లిదండ్రులకు శాశ్వతంగా దూరం కావాల్సి వచ్చింది. ఆ విషయం పెళ్ళికిముందే చెప్పారు వాళ్ళు. అయినా సరస్వతి బాధపడలేదు. తను కోరుకున్న వ్యక్తికి భార్యగా వెళ్ళటమే తన జీవిత పరమావధిగా భావించింది.

ఆస్తిపాస్తులు లేకపోయినా, జీవనోపాధికి లోటులేదు నారాయణరావు చేస్తున్నది చిన్న ఉద్యోగమే అయినా వాళ్ళిద్దరి జీవితాలకి అది చాలు. పరస్పరం కోరుకున్న వ్యక్తులు. హంగులూ, ఆర్భాటాలూ లేకపోయినా ఒకరినొకరు అర్థంచేసుకొని, సుఖజీవనం సాగించగలమన్న ధైర్యం వాళ్ళకుంది.

తన కోసం కన్న తల్లిదండ్రుల్నీ శాశ్వతంగా వొదిలి వచ్చిన సరస్వతిని అపురూపంగా చూసుకొనేవాడు నారాయణరావు.

కోరుకున్న వ్యక్తిని భర్తగా పొందానన్న సంతృప్తితో తన శాయశక్తులా భర్తను సుఖపెట్టడానికి ప్రయత్నించేది సరస్వతి.

వాళ్ళిద్దరి జీవితాలూ పడుగు పేకల్లా, పాలు నీళ్ళలా కలిసిపోయినయ్. ఇద్దరి మధ్య ఏవిధమైన పొరపొచ్చాలు లేవు. అభిప్రాయ భేదాలు లేవు. ఎప్పుడు ఒకరిలో ఒకరు ఐక్యమైపోవటానికి చేస్తున్న ప్రయత్నంలో వారి సంసారం అన్యోన్య దాంపత్యానికి ఆదర్శప్రాయంగా రూపు దిద్దుకుంది.

బూజు పట్టిన భావాలకి దాసులయి, సమాజపు కట్టుబాట్లను వుల్లంఘించే

ధైర్యం లేక, దాంపత్య జీవితాన్ని దుర్భర నరకప్రాయంగా చేసుకొని, మింగలేక, కక్కలేక సతమతమై పోయే చాలా మంది సంఘోపజీవులకు యిలాంటిస్వేచ్ఛాజీవుల్నిచూస్తేకన్నెర్ర. తమకు దుర్లభమైపోయిన సౌఖ్యం, ఆనందం వీళ్ళు అనుభవించేస్తున్నారని అసూయ, ఏవిధంగా వీళ్ళని బాధించాలా అన్న యావ.

అయితేనేం ?– ఇలాంటి చిన్న చిన్న సమస్యలన్నీ వాళ్ళ ప్రేమ ప్రవాహానికి మరింత పుష్టినీ, శక్తినీ, కలిగించినయ్ తప్ప అడ్డుగోడలు కట్టలేకపోయినయ్.

రోజులు గడిచినయ్. నెలలు గడిచినయ్. నాలుగు సంవత్సరాలు నాలుగు క్షణాల్లా దొర్లిపోయినయ్ వారి సుఖ సంసారంలో.

సరస్వతి నెల తప్పింది. ఆ భార్యాభర్తల ఆనందం వర్ణనాతీతం.

కన్నవారి ఆదరణకు నోచుకోని సరస్వతికి సర్వం తానేఅయి, అన్నిఉపచారాలూ తనే చేశాడు నారాయణరావు. సరస్వతికి నెలలు నిండినయ్.

సరస్వతి వొద్దంటున్నా లెక్కచెయ్యకుండా, యిప్పటికైనా మారకపోతారా అన్న ఆశాభావంతో ఆమె తల్లిదండ్రులకు ఉత్తరం ద్వారా ఈ శుభవర్తమానాన్ని తెలియచేశాడు నారాయణరావు.

'మీకూ మాకూ ఎట్టివిధమైన సంబంధ బాంధవ్యాలులేవు' అని తిరుగుటపాలోనే ఒక కార్డుముక్కరాసిపారేశాడు సరస్వతి తండ్రి.

"నేం చెప్పలేః వాళ్ళ సంగతి నాకు బాగా తెలుసు," అనేసింది నిశ్చింతగా సరస్వతి.

"ఇలాంటి సమయంలో పెద్ద దిక్కు అవసరం అని, కనీసం మీ అమ్మకైనా ఈ వార్త విన్న తర్వాత మనసు కరగక పోతుందా అన్న ఆశతో యిలా చేశాను సరస్వతీ!" అన్నాడు నారాయణరావు బాధగా.

"పోనిస్తురూ. తల్లిదండ్రులు లేని వాళ్ళంతా ఏమైపోతున్నారు ?" అనేసింది నిర్లక్ష్యంగా సరస్వతి.

ఎంత చిత్రమైన మనిషి! ఏమిటో ధైర్యం ? ఆశ్చర్యపోయాడు నారాయణ రావు.

* * *

సరస్వతికి నొప్పులు ప్రారంభమైనయ్. ఒక ప్రైవేట్ నర్సింగ్‌హోమ్‌లో చేర్పించాడు నారాయణరావు

అతనుంటున్నది అద్దె యిల్లు. ఇరుగు పొరుగులు చాలామంది వున్నారు. అంతా తప్పదన్నట్టు వచ్చి చూసి వెళ్ళినవాళ్ళే గాని, దగ్గరుండి సాయంచేసినవాళ్ళు ఒక్కరూ లేరు. ఆఫీసుకు ఒక వారం రోజులు శలవుపెట్టి, నిద్రాహారాలు మాని, అన్నీ తానే చక్కబెట్టుకొనేవాడు నారాయణరావు. ఇంటి యజమానీ, సహోద్యోగీ అయిన శివరామయ్య

మాత్రం అప్పుడప్పుడు సహాయ పడుతుండేవాడు.

సరస్వతి సుఖంగా ప్రసవించింది.

'అమ్మయ్య!' అనుకున్నాడు నారాయణరావు.

ఆడపిల్ల పుట్టింది.

ఆనందపారవశ్యంతో తేలిపోయింది అతని మనసు.

వారంరోజుల శలవు యిట్టే గడిచిపోయింది.

"ఇంకో వారం రోజులు శలవు మంజూరు చేయించుకొని వచ్చి నిన్ను యింటికి తీసుకుపోతాను సరస్వతీ!" అని ఆఫీసుకు బయల్దేరి వెళ్ళాడు నారాయణ రావు.

వెళ్ళినవాడు వెంటనే తిరిగి రాలేదు.

కంగారుపడింది సరస్వతి.

ఆరోజు గడిచిపోయింది.

పరిస్థితి అర్థంకాలేదు సరస్వతికి.

రెండోరోజు యింటి యజమాని శివరామయ్య నర్సింగ్‌హోమ్‌కు వచ్చి బిల్లు చెల్లించి, సరస్వతిని డిస్చార్జి చేయించి, యింటికి తీసుకుపోయాడు.

సరస్వతి ఎన్నో ప్రశ్నలు అడిగింది. శివరామయ్య ఒకే సమాధానం చెప్పాడు.

"నారాయణరావు ఆఫీసు పనిమీద అర్జెంటుగా ఏదో ఊరు వెళ్ళాల్సి వచ్చింది. నాకు డబ్బిచ్చి పంపించి, అతనలా వెళ్ళాడు"

నిజమే అనుకుంది పాపం సరస్వతి. కాని, ఆ మరునటి రోజునే ఆమెకు నిజం తెలిసిపోయింది.

జరగరానిదే జరిగిపోయింది. ఆఫీసు కని బయలుదేరి వెళ్ళిన నారాయణరావు దారిలో లారీ ప్రమాదానికి గురై అక్కడి కక్కడే ప్రాణం విడిచేశాడు. ఆ వార్త వెంటనే సరస్వతి చెవిని పడకుండా వుండటానికి కొంత కట్టుదిట్టం చేశాడు శివరామయ్య.

శివరామయ్య వయసులో కాస్త పెద్ద వాడు. అప్పటికి సుమారు నలభై వుంటుంది అతని వయసు. రెండేళ్ళ క్రితం భార్య పోయింది. పిల్లాపీచూ లేరు. ఆ వూళ్ళో నెలకు రెండువందలు అద్దె తెచ్చే రెండు ఇళ్ళువున్నాయతనికి. నారాయణరావు పనిచేసే ఆఫీసులోనే అతనూ పనిచేస్తున్నాడు. నారాయణ రావుతో చనువుగా వుండేవాడు. ఆ కారణంగా సిగ్గునభినయించే అలవాటులేని సరస్వతి గూడా అతనితో చనువుగా ఉండేది. అంచేతనే నారాయణరావు అతన్ని పంపించాడంటే ఆమె నమ్మింది.

భర్త మరణవార్త విన్న వెంటనే సరస్వతి మనసు పరిపరివిధాల పోయింది. కాని, పిల్ల ముఖంచూసి కాస్త విగ్రహించుకోగలిగింది

నారాయణరావు చేసింది చిన్న ఉద్యోగమే కాబట్టి డబ్బేమీ మిగల్చ లేకపోయాడు, సర్వీసు కూడా అంత ఎక్కువ కాదుకాబట్టి ప్రావిడెంటు ఫండు కూడా ఎంతో లేదు.

భర్తపేరుమీద సరస్వతికి ముట్టిన మొత్తం బహు తక్కువ. ఆ డబ్బుతో ఆమె కేవలం కొన్ని నెలలు మాత్రమే జీవించగలదు. ఆ కాస్త అయిపోయిం తర్వాత ఏం చేసేట్టు?

ఆమె చదువుకున్నదే గాని, ఉద్యోగానికి పనికొచ్చేంతగా చదువుకోలేదు.

ఆయన తరపు బంధువులు లేనే లేరు. తన తరపు వుండీ లేనట్టే. తనకు తోడు ఈ పసిగుడ్డు! ఈ రెండు జీవితాలు గడిచి గట్టెక్కే దెలా?

అంతా అగమ్యగోచర మైపోయింది సరస్వతికి.

అప్పటికి శివరామయ్య ఆదుకున్నాడు అన్నింటికీ. నెల పూర్తైనా యింటి అద్దె అడగలేదు. పైగా యింట్లోకి కావాల్సిన అన్ని సంబారాలూ అతని డబ్బుతోనే కొని తెచ్చాడు. తన భర్త వుండగా తన కుటుంబంలో అతని కున్న సాన్నిహిత్యం కొద్దీ అతనా మాత్రం చేశాడు. ఆర్థికంగా కాస్త వున్నవాడు కాబట్టి యిలా కొన్ని రోజులు మహా అయితే, మరో నెల ఆదుకోగలడు. తర్వాత? మొహమాటంకొద్దీ యింక కొన్నాళ్ళు అతనే ఆదుకోవచ్చు. కాని, ఒకరి దయాదాక్షిణ్యాల మీద ఎన్నాళ్ళు ఆధారపడటం? జీవితం అంటే ఒకటి రెండు నెల్లతో తీరిపోయేదా?

సరస్వతి తీవ్రంగా ఆలోచించింది.. మొదట్నుంచీ ఆమెది చిత్రమైన మన స్తత్వం. ధైర్యంగా పరిస్థితుల్ని ఎదుర్కోవటం, చొరవగా ఒక నిర్ణయానికి రావటం. ఎవరో ఏదో అనుకుంటారన్న జంకులేకుండా జీవితాన్ని తన భావాలకు అనుగుణంగా మలుచుకోవటం ఆమెలోని ప్రత్యేకతలు. తనూ, తన కూతురూ దిక్కులేని పక్షులై ఏ చెట్టుకిందనో, పేవ్‌మెంట్ల మీదనో, అనాధల్లా విలువైన జీవితాలని వ్యర్థంచేసుకోవటం ఆమె కిష్టంలేదు. అందుకు సరైన మార్గం ఏమిటా అని ఆలోచించింది. బాగా ఆలోచించింది.

ఒకరోజున శివరామయ్యని సూటిగా అడిగేసింది — "నన్ను పెళ్ళిచేసుకోవటానికి మీ కేమన్నా అభ్యంతరమా?" అని.

శివరామయ్య బిత్తరపోయాడు. అతను కలలోనైనా వూహించని ప్రశ్న అది. వెంటనే సమాధానం చెప్పలేకపోయాడు.

"బాగా ఆలోచించుకునే సమాధానం చెప్పండి." అంది సరస్వతి.

రెండేళ్ళుగా భార్యలేని లోటు అనుభవిస్తున్నాడు శివరామయ్య. శక్తి వుంది. సంపాదన వుంది. ఒంటరి జీవితం గడపటం దుస్తరంగానే వుంది. భార్య పోయిన దుఃఖంలో యింతవరకు మళ్ళీ వివాహాన్ని గురించిన ఆలోచన చెయ్యలేదు గాని, నలభై యేళ్ళు అంత పెద్ద వయస్సేమీ కాదు.... సరస్వతి గురించి

తనకు బాగా తెలుసు. అంత విజాయితీ గల మనిషి తనకెక్కడా తారసపడ లేదు. మాట మీద నిలబడుతుంది. నమ్మిన చోట ప్రాణాలు విడుస్తుంది. ఎటొచ్చీ ఆ పసిపిల్ల! ఇంతవరకు తను ద్వితీయం గురించి ప్రయత్నించలేదు గాని, ప్రయత్నించితే ఈ వయసులో కన్నెపిల్లలెవరూ తనతో వివాహానికి మనస్ఫూర్తిగా అంగీకరించరు. అన్ని విధాలా చెడిపోయిన ఏ విధవనో చేరదియ్యటం కంటే నిప్పులాంటి సరస్వతిని వివాహం చేసుకోవటం వుత్తమం కాదా?

లాభనష్టాలు బేరీజు వేసి చూసుకొని, ఒక నిర్ణయానికి వచ్చి, ఒకరోజున తన సమ్మతిని సరస్వతికి తెలియపర్చాడు శివరామయ్య.

సరస్వతీ శివరామయ్యా భార్యాభర్తలయ్యారు.

ఇంకేముంది? సంఘం దృష్టిలో ఒక జరగకూడని పని జరిగిపోయింది. చుట్టూ వున్న కొంతమంది సోమరులైన సంఘ ప్రతినిధులకు మళ్ళీ పని తగిలింది. నడుములు బిగించి, కార్యభారాల్ని భుజస్కంధాల మీద కెత్తుకున్నారు. అవకాశం దొరికినప్పుడల్లా శివరామయ్యనీ, సరస్వతినీ సూటిపోటి మాటలనసాగారు. కొందరు వాళ్ళ మొహం మీదే అనేశారు. కొందరు వాళ్ళల్లో వాళ్ళే తెగ గుంజాటన పడిపోయారు. కొందరు వాళ్ళంతట వాళ్ళు ఏమీ అనలేకపోయినా ఎవరైనా అంటుంటే ఆసక్తిగా విని, ఆనందించారు. కొంత కాలం ఆ ప్రాంతాల వాళ్ళకి అదో కాలక్షేపంగా జరిగిపోయింది.

మేము నాగరికులం, సాంప్రదాయకులం, గొప్ప వాళ్ళం అంటూ జబ్బలు చరుచుకొనే అగ్రకులాల వాళ్ళలో సంప్రదాయం పేరిట జరిగే అన్యాయాలు, అక్రమాలు, అమానుష కృత్యాలు అధమ జాతులుగా పరిగణింపబడుతున్న వారిలో జరగటానికి మొదట్నుంచీ అవకాశం లేదు. అగ్రవర్ణాల వారికి, చప్పన్న శాస్త్రాలు చదివి ఎంతో సంస్కృతినీ, నాగరికతనూ సొంతం చేసుకోవటం చేత నీతులు, నియమాలు, కట్టుబాట్లూ అధికం. మొగుడు చచ్చిన స్త్రీకి ముండనం చేయించటం, ముండమోసిన స్త్రీ వయసులో వున్నదే అయినా మళ్ళీ మొగుడ్ని పొందే అర్హత లేకుండా చెయ్యటం లాంటి అన్యాయాలు, అక్రమాలు అనాదిగా అగ్రవర్గాలవారి సంప్రదాయం జరిపిస్తున్న పనులే. కందుకూరి, గురుజాడ మొదలైన యుగపురుషులు ప్రయత్నించింది కుక్క తోకలోని వంకర లాంటి యిలాంటి సంప్రదాయాల్ని మరమ్మత్తు చెయ్యటానికే. ఎంతోమంది పుడుతున్నారు. గిడుతున్నారు. కాలం గడుస్తోంది. ఎన్నో రంగాల్లో అభివృద్ధిని సాధించ గలుగుతున్నాం. కాని, ఎంతో మంది జీవితాల్లోని సౌభాగ్యాన్ని జలగల్లా

పేల్చి పారేస్తున్న ఈ పాడు సాంప్రదాయాలు మాత్రం పూర్తిగా మరమ్మత్తు కావటం లేదు. ఇప్పటికీ ఆస్తుల కోసం, మనోవర్తుల కోసం చిన్న వయసులో వుండి కూడా యావజ్జీవితం వితంతువులుగానే గడపటానికి సిద్ధపడే స్త్రీలు కొందరున్నారు. అలాంటి వాళ్ళని చూసి జాలి పడాలో, అసహ్యించుకోవాలోఅర్థంకాదు.

శివరామయ్య అచ్చమైన ఆరువేల నియోగి బ్రాహ్మడు. సరస్వతి పుట్టింది నియోగీ బ్రాహ్మణ కుటుంబమే. అయితే, అబ్రాహ్మణుడైన నారాయణరావుకి భార్య కావటం వల్ల ఆమె బ్రాహ్మణ్యం మంట గలిసిపోయింది. ఆమెను భార్యగా చేసుకోవటం వల్ల శివరామయ్య కూడా కులం చెడిపోయాడు.

సరస్వతిని పెళ్ళిచేసుకున్న మరుక్షణం నుంచీ శివరామయ్య తన బంధువర్గాన్ని కంతటికీ దూరమైపోయాడు. అతను కులం చెడిపోయాడని వాళ్ళంతా అతన్ని వెలివేసినట్టు ప్రవర్తించారు. బాగా దగ్గర బంధువులు కూడా అతనితోడి సంబంధ బాంధవ్యాలన్నీ పూర్తిగా తెగతెంపులు చేసేసుకున్నారు.

'అలా మొగుడు చచ్చాడు. ఇలా యితన్ని తగులుకుంది. మొగుడు పోయాడన్న విచారమూ లేదు నలుగురు ఏమన్నా అనుకుంటారన్న భయమూ లేదు ఏం కలికాలమొచ్చిపడిందా?'

'కులం తక్కువ వాడితో లేచొచ్చిందానికి నీతీ జాతీ ఏమిటి? ఎవరో ఏదో అనుకుంటారన్న భయం మనబోటి సంసారుల కుంటుందిగాని, అన్నింటికీ తెగించినదాని కెందుకుంటుంది.

'అప్పుడు వాడితో అవసరం వచ్చింది. కంటికొక్కస్త నదురుగా కనిపించాడు కామోసు, కులం తక్కువైనా వాడితో లేచొచ్చేసింది. వాడు పోయాడు. ఇప్పుడు మరొకడి అవసరం వుంది కదా! శివరామయ్యని తగులుకుంది. వయసు పెద్దదైతే నేం – యింతో అంతో వెనకేశాడుగా శివరామయ్య.'

'అదెలాగూ చెడిపోయింది. ఈ వయసులో ఈ శివరామయ్యకేం పొయ్యే కాలమొచ్చిందీ ఆ గుదిబండను తగిలించుకున్నాడు? దానికితోడు ఒకపిల్లగూడాను!'

'పాపం శివరామయ్య మంచివాడే నమ్మా! అదే ఏ మందో మాకో పెట్టి వలలో వేసుకొని వుంటుంది!'

'ఆఁ. చూట్టాని కందరూ మంచిగానే కనిపిస్తారు గాని, నా అనుమానం అతను పోక ముందునుంచే వాళ్ళిద్దరికీ సంబంధం వుందని! మా ఎదురిల్లే కదా – వీళ్ళ పోకిళ్ళన్నీ ఒక కంట కనిపెడ్తూనే వుండేదాన్ని. అయినా ఎవరెలా పోతే మన కెందుకని, వూరుకుండేదాన్ని.'

'నిజమేనమ్మా! మాయదారి సంత మనకొచ్చి పడింది. వాళ్ళకేం హాయిగానే వుంటారు. ఎదిగినాడపిల్లలు గల మనలాంటి వాళ్ళకే గుండె దడగావుంది. అయినా ఏం చెయ్యగలం చెప్పు!'

ఇలా ఎంతోమంది ఎన్నో రకాలుగా

అనుకున్నారుగాని ఎవ్వరూ ఏమీ చెయ్య లేకపోయారు. ఇలాంటితాటాకుచప్పుళ్ళకు జడిసే పరిస్థితిలో వుంటే వాళ్ళసలు చెయ్యగలిగి వుండేవారే కాదు.

ఇలాంటి సమస్యలు కొద్ది కాలం మాత్రమే కాలక్షేపానికి పనికొస్తాయి. కాలం గడిచే కొద్దీ సమస్య పాతబడి, వ్యక్తుల దృష్టి కొత్త సమస్యల మీదికి పోతూ వుంటుంది.

శివరామయ్య సరస్వతి లక్షణంగా కాపురం చేసుకోసాగారు. ఇద్దరూ కలిసి ఆ పసిపిల్లకు అనూరాధ అని పేరు పెట్టుకున్నారు.

మొదట్లో అనూరాధను చూస్తుంటే శివరామయ్యకి ఏదో బెరుగ్గా వుండేది. కాని, రానురాను ఆ పిల్ల తన స్వంత కూతురే అన్న భావాన్ని ఏర్పర్చుకో గలిగాడు. అందుకొంత కారణం సరస్వతి ప్రవర్తనే కావచ్చు.

అభ్యుదయ భావాలు గల సరస్వతి ప్రవర్తన శివరామయ్య వ్యక్తిత్వంమీద బాగా ప్రభావాన్ని చూపించింది.

సరస్వతితో సాంగత్యం మొదలైం దగ్గర్నుంచి శివరామయ్యలో ఒక నూత నోత్సాహం, వుత్తేజం ప్రవేశించినయ్. ఆమె ఆదరణలోనూ, అనురాగంలోనూ అంతకుముందు కొన్నిసంవత్సరాలపాటు మరో స్త్రీతో సంసారం చేశానన్న సంగతే మర్చిపోగలిగాడు శివరామయ్య.

కాలం గడుస్తోంది. ఒకటి_రెండు_ మూడు—నాలుగు— సంవత్సరాలు గడుస్తున్నాయి. సరస్వతికి మళ్ళీ పిల్లలు పుట్టలేదు.

అనురాధకు పదకొండో సంవత్సరం వచ్చిన కొద్ది రోజులకు శివరామయ్య కాలం చేశాడు.

సరస్వతి చాలా బాధపడింది కాని, ఎవ్వరి సానుభూతినీ ఆశించలేదు. మళ్ళీ ఒక ముఖ్య సమస్యను ఎదుర్కొనవలసిన పరిస్థితి ఏర్పడిం దామెకు. అయినా ఎవ్వరి సహాయానికీ ఎదురుచూడలేదు.

శివరామయ్య బ్యాంకులో దాచిన రొక్కం కొంత సురక్షితంగా వుంది. ఇళ్ళమీద రెండువందలకు పైనే అద్దె వస్తుంది. అందులోనే కొంత ఖర్చు పెడుతూ. కొంత - రాబోయే అవసరాలను దృష్టిలో ఉంచుకొని మిగుల్చు కొంటూ గుట్టుగా కాలం గడుపుకొస్తోంది సరస్వతి.

ఇది జరిగిన కథ!

* * *

సరస్వతి రచయిత్రి కాదు. తన పూర్వచరిత్రను రసవత్తరమైన కథగా మలిచి చెప్పగలిగేందుకు అవసరమయ్యే భాషా పరిజ్ఞానం, రచనా కౌశలం ఆమెకు లేవు. అందుచేత నాలుగంటే నాలుగు వాక్యాల్లో — అవసరమనుకున్నంత వరకు తన గత చరిత్రను ముందు చెప్పి తర్వాత యిలా సాగించింది ఉత్తరం.

....మా సంబంధం మొదట మీకు అన్ని విధాలా నచ్చింది. కాని, ఎంతో కాలం క్రింద జరిగి, కాలగర్భంలో

కలిసిపోయిన కొన్ని విషయాలను తవ్వి బయటికి తీసినతర్వాత మళ్ళీ మీకు సంప్రదాయం అడ్డుపడింది. ఎవరెవర్నో అడిగి, పాత సంగతులన్నీ అరా తీసిం తర్వాతగాని మాది సంప్రదాయం (మీ దృష్టిలో) లేని కుటుంబం అని మీకు తెలీలేదు. అంచేత ఈ సంప్రదాయమనేది మనుషుల ముఖాలమీద రాసివుండదన్న సత్యాన్ని మీరూ ఒప్పుకుంటారు. ఒక వ్యక్తిని తీసుకొచ్చి బజారులో నిలబెట్టి ఈ వ్యక్తికి సంప్రదాయం వుందా లేదా అని అడిగితే సంప్రదాయాన్ని సంరక్షించటం కోసం కంకణం కట్టుకున్న మీలాంటి పెద్దమనుషులెవ్వరూ సమాధానం చెప్పలేరు. ఇలాంటి చాదస్తపు సంప్రదాయాన్ని పట్టుకువేలాడే మీలాంటివారికి కలిగే సంతృప్తి ఏమిటో నా కర్థంకాదు. కులాంతర వివాహాలు, మతాంతర వివాహాలు ఈనాడు నాగరికతగా పరిగణింపబడుతాయి. కాని, సంప్రదాయం కోసం పడిచచ్చిపోయే నా తల్లిదండ్రులు ఆనాడు నేను కులాంతర వివాహం చేసుకున్నందుగ్గాను శాశ్వతంగా నన్ను దూర చేసుకున్నారు. మీ సాంప్రదాయికులు ఈనాటికీ ఇలాంటి వివాహాలను మనస్ఫూర్తిగా సమర్థించ లేకపోతున్నారు. అందుచేత మిమ్మల్ని నాగరికత లేనివారనొచ్చా?

శివరామయ్యగారు కూడా నన్ను భార్యగా చేసుకోనంతవరకు మీ సాంప్రదాయికుల కోవలోని వ్యక్తే. అయితే, ఆయన మీలాగా గుడ్డిగా సంప్రదాయం కోసం ప్రాకులాడలేదు. తన ఆనందానికి అడ్డువచ్చిన పాత సంప్రదాయాల్ని సమయానుకూలంగా సవరించుకున్నారు. నన్ను భార్యగా చేసుకున్నారు. నా కూతుర్ని స్వంత కూతురిగా అంగీకరించారు. బజారుపాలు కానున్న మా రెండు జీవితాలనూ ఆదుకొని కొంత సంఘసేవ చేసినవారయ్యారు. అటు ఆయనా కొంత సుఖాన్ని పొందగలిగారు.

ఈ సంప్రదాయాలూ నీతులూ నియమాలూ అనేవి మనం తెచ్చిపెట్టుకున్నవే గాని, వాటంతట అవి పుట్టుకొచ్చినవి కావు. కులమతాలమధ్య ఒకప్పు డున్నంత అంతరం యిప్పుడు లేదు. ముందుముందు యింకాతగ్గిపోతుంది. ఈసంప్రదాయాలూ నీతులూ నియమాలూకూడా అంతే!

సంఘంలో ఎవ్వరికీ ఎలాంటి కష్టం లేకపోయినా సంప్రదాయం పేరు చెప్పి ఒక వ్యక్తిని సుఖపడనివ్వకుండా చెయ్యటం అన్యాయం, అక్రమం. అది సంప్రదాయం అనిపించుకోదు. ఒకవేళ అదే సంప్రదాయం అని మీరంటే అలాంటి సంప్రదాయం మన కనవసరం. మానవుల సుఖశాంతులకు నష్టం కలిగించే సంప్రదాయం అదేం సంప్రదాయం? అలాంటిదాన్ని వెంటనే సవరించాలి. ఎవడి భార్యనో బలవంతాన లేవదీసుకుపోవటం తప్పు. అశుభం శుభం తెలీని ఒక ఆడపిల్లను మోసం చెయ్యటం తప్పు. ఇద్దరు యువతీ యువకులు పరస్పరం యిష్టపడి కులాలు, మతాలు

వేరైనా ధైర్యంగా పెళ్ళిచేసుకోవటం తప్పుకాదు. ఇలాంటి విచక్షణతో సంప్రదాయానికి వెలకట్టుకోవాలి కాని, ఎప్పుడో ఎన్నో తరాల క్రితం ఎవరో యిలా వుంటేనే సంప్రదాయం అన్నారు కాబట్టి యిప్పుడూ అలాగే వుండాలనుకోవటం సాంప్రదాయికం అనిపించుకోదు. అది కేవలం మూర్ఖత్వం. బూజుపట్టిపోయి, మనుగడకు అడ్డువస్తున్న కొన్ని పాత సంప్రదాయాలు ఎప్పటికప్పుడు మరమ్మత్తు చెయ్యబడుతూనే వున్నాయి. ఒక్కో పరిస్థితిలో అనుల్లంఘనీయమైన సంఘం కట్టుబాట్లను కాదని, అందరూ పొందలేని కొన్ని ప్రత్యేక సౌఖ్యాలను పొందగలిగే సాహసవంతులు అప్పుడూ యిప్పుడూ కూడా వున్నారు. వాళ్ళ ప్రవర్తన మరొకరికి కష్టం కలిగించనంత వరకు అలాంటివారిని మెచ్చుకోవాలి. ప్రోత్సహించాలి.

ఇలా రాస్తూపోతే ఈ ఉత్తరానికింక అంతు వుండదు. అలా రాయాలని నా ఉద్దేశ్యం కాదు కూడా. కాగితంమీద కలంపెట్టగానే అలా సాగిపోయింది. నా మనసుకు తోచిన విషయాలు కొన్ని రాశాను. మీరు ఎలా అర్థంచేసుకున్నా ఒకటే. దయచేసి ఒక్క విషయానికి మాత్రం సమాధానం చెప్పండి. చదువు, సంస్కారం, అందం, అణకువ కలిగిన మా అమ్మాయిని మీరు కోడలిగా ఎందుకు చేసుకోలేకపోతున్నారు? కేవలం సంప్రదాయాన్ని కాపాడుకోటానికే కదా? సంప్రదాయంకోసం అందరికీ నచ్చిన మా అమ్మాయిని వదులుకుంటున్నారు. అంటే అర్థం మీరు వుత్త పిరికివారు. సంఘాన్ని ఎదిరించే ధైర్యంలేక మీ అందరికీ యిష్టమైన పని కూడా చెయ్యలేకపోతున్నారన్న మాట! చూశారా మీ సంప్రదాయం ఎంత ఇరకాటంలో పెట్టేసిందో? మిమ్మల్ని పిరికివాళ్ళుగా నిరూపించింది. ఇలాంటి చచ్చు సంప్రదాయానికా మీరు అంత విలువ యివ్వటం?

మా అమ్మాయిని కాదన్నారు సరే. మీకు నచ్చిన సాంప్రదాయికమైన కుటుంబంలో పుట్టి పెరిగిన మరో అమ్మాయిని వెదికి మీ అబ్బాయికి పెళ్ళిచేస్తారనుకుందాం. అప్పుడు వాళ్ళిద్దరూ జీవితాంతం సుఖంగా గడపగలరని మీరు నిశ్చయంగా చెప్పగలరా? పోని మా అమ్మాయిని చేసుకున్నందువల్ల మీ అబ్బాయి జీవితాంతం సుఖపడలేడనైనా చెప్పగలరా? ఈ రెండు ప్రశ్నలలో ఏ ఒక్కదానికైనా మీరు సమాధానం చెప్పగలిగితే దయచేసి ఉత్తరం రాయండి. శలవ్.

ఇట్లు
సరస్వతి."

ఉత్తరం పూర్తిచేసి పోస్టు చేయించింది సరస్వతి. రోజులు, వారాలు, నెలలు గడిచినయ్. కాని, వెంకట్రామయ్య దగ్గర్నుంచి ఆమె ప్రశ్నకు సమాధానం రాలేదు.